రెచ్చిపోతున్న గంజాయి గ్యాంగ్

- ఎంవీపీ, త్రీటౌన్ పీఎస్‌ల పరిధిలో నిత్యం ఆగడాలు
- వరుస ఘటనలతో స్థానికుల్లో భయాందోళనలు
- కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలం



ఆదర్శనగర్‌లో సీసీ కెమెరాలు తొలగించేందుకు వస్తున్న నిందితులు(సీసీ ఫుటేజ్)

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి గ్యాంగ్ రెచ్చిపోతోంది. పనీపాటా లేకుండా ఆకతాయిగా తిరిగే యువకులతో కూడిన ఈ బ్యాచ్‌లు నిత్యం గొడవలు, నేరాలకు పాల్పడుతున్నాయి. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో రెడ్ జోన్‌లుగా ఉన్న మద్దిలపాలెం, రెల్లి వీధి, ఆదర్శనగర్, పెదవాల్తేర్, అప్పుఘర్ ప్రాంతాల్లో నిత్యం వీరి ఆగడాలు కొనసాగుతున్నాయి. ఎంవీపీ పీఎస్ పరిధి ఆదర్శనగర్‌లో ఇటీవల నిత్యం గంజాయి సేవించే ఇద్దరు కుర్రాళ్ల సృష్టించిన వీరంగంతోపాటు గత బుధవారం రాత్రి మద్దిలపాలెంలో స్విగ్గీ బాయ్‌పై గంజాయి మత్తులో ఓ యువకుడు కత్తితో దాడి చేసిన ఘటనలు ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. అనేక ఘటనల్లో స్థానిక ప్రజలు పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నా.. కఠిన చర్యలు తీసుకోవడంలో వారు విఫలమవుతున్నారు.

సెల్‌ఫోన్ లాక్కెళ్లాడు..

గంజాయికి అలవాటు పడ్డ ఓ యువకుడు కాల్ చేసుకుంటానని చెప్పి వాల్తేర్‌లో ఒక వ్యక్తి వద్ద సెల్‌ఫోన్ తీసుకొని పరారయ్యాడు. అవాక్కయిన ఆ వ్యక్తి స్థానికుల సహాయంతో అతడిని పట్టుకొని ఎంవీపీ స్టేషన్‌లో అప్పగించేందుకు తీసుకెళ్లగా.. పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించినట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఇప్పుడు స్టేషన్‌లో ఎవరూ లేరని, నిందితుడిని సాయంత్రం తీసుకు రండంటూ కొందరు పోలీసులు ఫిర్యాదుదారులతో చెప్పారు. సాయంత్రం వరకు నిందితుడిని తాము ఎలా వెంటబెట్టుకొని తిరిగేదంటూ పోలీసులపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆదర్శనగర్‌లో హల్‌చల్..

ఆదర్శనగర్‌లో గంజాయికి అలవాటు పడ్డ కొందరు యువకులు హల్‌చల్ చేస్తున్నారు. అక్కడ నేరాలు అడ్డుకునేందుకు స్థానికులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సైతం విరగ్గొట్టి మరీ నేరాలకు పాల్పడుతున్నారు. దలాయి నాని అనే యువకుడు ఇటీవల కాలనీలో హల్‌చల్ చేయగా.. ఆందోళనకు గురైన నివాసులు 112కి ఫిర్యాదు చేశారు. అక్కడికి పోలీసులు రాగా ఆ యువకుడు వారిపై కూడా తిరగబడటంతో గంజాయి సేవించి ఉన్నాడంటూ చేతులెత్తేశారు. ఆ మరుసటి రోజు నాని, ఎం.పవన్‌లు కలిసి కాలనీలో సీసీ కెమెరా తొలగించి మరీ దొంగతనానికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా.. ఇప్పటికీ వారిపై చర్యలు తీసుకోలేదు. నేరస్తులకు చుక్కలు చూపించాల్సిన నిఘా విభాగం, రాత్రి గస్తీ, టాస్క్ బృందాల వైఫల్యంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆదర్శనగర్ వాసులు ఆరోపిస్తున్నారు.

స్విగ్గీ బాయ్‌పై దాడి..

మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ దరి ఏయూ ముఖ ద్వారం వద్ద గత బుధవారం రాత్రి అమర్ అనే యువకుడు గంజాయి మత్తులో స్విగ్గీ డెలివరీ బాయ్‌పై కత్తితో దాడికి పాల్పడటం కలకలం రేపింది. సకాలంలో త్రీటౌన్ క్రైం పోలీసులు అక్కడికి చేరుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెల్లి వీధి, ఊటగడ్డ ప్రాంతాల్లో ఇటువంటి ఘటనలు మరిన్ని వెలుగులోకి వస్తున్నాయి.

అప్పుఘర్‌లో రౌడీ చేష్టలు

ఎంవీపీ కాలనీ సెక్టార్-9 అప్పుఘర్ ఏరియాలో మొల్లి వెంకటరమణ అనే రౌడీ(సస్పెక్టెడ్ షీట్) నిత్యం హల్‌చల్ చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులున్నాయి. డీఆర్‌డీఏ ప్రాంతంలో అనేక మందిపై వెంకటరమణ దాడులకు దిగిన ఘటనల వీడియోలు పెద్ద ఎత్తున వెలుగులోకి వచ్చాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు అతడిని పట్టుకునేందుకు పలువురు పోలీసులు వెళ్లిన సందర్భంలో వారిపై కూడా వెంకటరమణ దాడికి యత్నించాడు. దీంతో పోలీసులు చేసేది లేక వదిలేయడంతో నేటికీ ఆ ప్రాంతంలోని స్థానికులు రాత్రి పూట ఆందోళనకు గురవుతున్నారు.



అప్పుఘర్‌లో ఓ ఇంట్లోని వ్యక్తులపై దాడికి యత్నిస్తున్న వెంకటరమణ(వీడియో పిక్)

క్లుప్తంగా

ఉత్సాహంగా వైజాగ్ జూ మారథాన్

ఆరిలోవ: వైజాగ్ ట్రయల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జూ సాగర్ గేటు వద్ద వైజాగ్ జూ మారథాన్ నిర్వహించారు. అధిక సంఖ్యలో పిల్లలు, యువత మారథాన్ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వాహకులు వీరికి 21కే, 10కే, 5కే, 3కే పోటీలు నిర్వహించారు. మారథాన్‌లో విజేతలకు విభాగాల వారీగా అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు.

మానసిక ఆస్పత్రి నుంచి యువకుడి అదృశ్యం



వెంకట సంజయ్ కుమార్

బీచ్‌రోడ్డు: మానసిక వైద్యం పొందుతున్న ఓ యువకుడు అదృశ్యమైనట్లు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ప్రకాశం జిల్లాకు చెందిన వెంకట సంజయ్‌కుమార్‌కు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో అతడి తల్లిదండ్రులు గత నెల 29న ఇక్కడి మానసిక వైద్యశాలలో చేర్పించారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఆస్పత్రి వార్డు నుంచి బయటకు వెళ్లిన సంజయ్ తిరిగి రాలేదు. ఆస్పత్రి బయట వెతికినా కనిపించలేదు. దీంతో ఆదివారం సంజయ్ తల్లిదండ్రులు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మిస్సింగ్ కేసును హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు అప్పగించారు. సంజయ్ ఆచూకీ తెలిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఎండాడ ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించిన సీపీ



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మధురవాడ: ఎండాడ ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయాన్ని విశాఖ నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం అర్ధరాత్రి సందర్శించారు. నగరంలో వివిధ పోలీసు స్టేషన్‌లు, ప్రాంతాలు ఆకస్మికంగా సందర్శిస్తూ వస్తున్న ఆయన అర్ధరాత్రి సమయంలో ఇక్కడకు వచ్చి తనిఖీలు చేశారు. అధికారులు, సిబ్బంది విధులను సమీక్షించి సూచనలు చేశారు. జోన్ పరిధిలోని ట్రాఫిక్ సమస్యలు, కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

అలరించిన జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

పీఎంపాలెం: దసారా సంబరాలలో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి ,జాననద నృత్య ప్రదర్శన అలరించింది. నగరంలోని కిరణ్మయి నృత్య నికేతన్ విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. జాపపద నృత్యాలలో ఎంత చక్కనివాడే ..అయిలారే.. నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు కున్పిత, శ్రావ్య, లక్ష్మీ దీక్షిత, రిషిత, హిమబిందు, మోక్షిత, జాన్వి, లహరి, కీర్తి, చైత్ర పాల్గొనగా.. జీవన కిరణ్మయి నృత్య దర్శకత్వం వహించారు.

'ప్రసాద్' పనుల పురోగతిపై ఏడీసీ సమీక్ష

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న ప్రసాద్ స్కీమ్ పనులపై రాష్ట్ర దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్(ఏడీసీ) కె.రామచంద్రమోహన్ ఆదివారం టూరిజం, దేవదాయశాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. దేవస్థానంలో రూ.54 కోట్ల కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు.

ఆశా జాస్తికి శక్తి నవరత్న అవార్డు



ఆశా జాస్తిని అవార్డుతో సత్కరిస్తున్న వరల్డ్ ఆఫ్ ఉమెన్ ఫెడరేషన్ ఇండియా ప్రతినిధులు

ఆరిలోవ: దసరా పండగ సీజన్‌ను పురస్కరించుకొని వరల్డ్ ఆఫ్ ఉమెన్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో శక్తి నవరత్న అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో సేవలు చేసిన వారికి, మహిళా సాధికారితను పరిగణలోకి తీసుకొని కొందరికి అవార్డులు ప్రదానం చేశారు. ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డుకు నగరంలోని సన్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వరల్డ్ ఆఫ్ ఉమెన్ ఫెడరేషన్ ఇండియా ప్రతినిధులు ఆమెకు అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆశా జాస్తి మాట్లాడుతూ తాను విద్యా రంగంలో చేసిన కృషికి ఈ అవార్డు లభించిందన్నారు.

విశాఖను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలి



మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న లగుడు గోవిందరావు

బీచ్‌రోడ్డు: విశాఖను పర్యాటక హబ్‌గా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. రాష్ట్ర టూరిజం, కల్చరల్, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ఆదివారం ఆయన ప్రభుత్వ అతిథి గృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ పర్యటకంగా ఎంతో అభివృద్ధి సాధించడానికి అవకాశముందన్నారు. ఫిల్మ్ ఇండస్ట్రీని పూర్తిస్థాయిలో విశాఖలో ఏర్పాటు చేయాలని, ఫిల్మ్ స్టూడియోలను తక్షణం ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరారు. వాటిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్ల సత్యం, వరుదు రాజ్‌కుమార్, రెడ్డి ఈశ్వరరావు, బర్ల పైడం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలి



పోర్టు హాస్పిటల్ వద్ద రిలే నిరాహార దీక్షలో నాయకులు

తాటిచెట్లపాలెం : సాలగ్రామపురంలోని విశాఖపట్నం పోర్టు అథారిటీ హాస్పిటల్‌ను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు కొనసాగిస్తున్న రిలే నిరాహారదీక్షలు ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కె.సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర మంత్రి సర్బానంద్ సోనోవాల్ ప్రకటించిన విధంగా పోర్టు ఆస్పత్రిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లాభాల్లో నడుస్తున్న పోర్టు నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలని కోరారు. వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటు నాయకులు జెసత్యనారాయణ, త్రినాథ్, శంకర్రావు, జేడీ లక్ష్మీ, నర్సింగరావు, ఈశ్వర్రావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ పాత్ర కీలకం



ఎస్వీ రామారావును సత్కరిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట : ప్రభావితమైన సినిమాలు ప్రేక్షకులకు చేరువ చేయడంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ పాత్ర ఎంతో ఉందని ప్రముఖ రచయిత ఎస్వీ రామారావు అన్నారు. బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ విదేశీ భాషల్లో రూపొందిన సందేశాత్మక, సాంప్రదాయ, సాంస్కృతిక చిత్రాలను, విశేష ఆదరణ పొందిన చిత్రాలను విశాఖ ప్రజల కోసం ఫిల్మ్ సొసైటీ ప్రదర్శించిందన్నారు. సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ 2003లో సంస్థను స్థాపించి 21 సంవత్సరాలుగా అనేక ఫిల్మ్ ఫెస్టివల్స్, ప్రముఖ దర్శకులు, టెక్నీషియన్లతో ముఖా ముఖీ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపా రు. అనంతరం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సొసైటీ సంయుక్త కార్యదర్శి బి.చిన్నారావు, ఉపాధ్యక్షుడు ఎ.కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారి ఆర్.శివకుమార్, కార్య వర్గ సభ్యుడు బి.గణేశ్వర బాబ్జి పాల్గొని సొసైటీ తరపున ఎస్వీ రామారావును సత్కరించారు.

మంత్రి పవన్‌కల్యాణ్ జూ పర్యటన రద్దు

ఆరిలోవ: రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఇందిరాగాంధీ జూ పార్కు పర్యటన రద్దయింది. ఈ నెల 7న ఆయన జూ పార్కును సందర్శించనున్నట్లు అటవీ శాఖ అధికారులకు ముందుస్తు సమాచారం రావడంతో నాలుగు రోజులుగా హడావుడి చేశారు. అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టారు. జూ లోపల రోడ్డుకు ఇరుపక్కలా ఎక్కడా పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయించి, రహదారి పక్కన అందం కోసం పచ్చని మొక్కలు నాటించారు. మంత్రి అటవీ శాఖ అధికారులతో సమావేశం కోసం జూలో బయోస్కోప్‌ను సిద్ధం చేశారు. జూ ప్రధాన ద్వారంతోపాటు లోపల ఎక్కడెక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలో దానికి సంబంధించిన కాంట్రాక్టర్‌కు అప్పగించేశారు. ఇదంతా జరిగిన అనంతరం మంత్రి గారి జూ పర్యటన రద్దయినట్లు ఆదివారం చల్లని కబురు అటవీ శాఖ అధికారులకు అందింది. మంగళగిరిలో ఆయన అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. దీంతో జూ పార్కులో అధికారుల హడావుడికి బ్రేక్ పడింది.

తొట్లకొండపై సీడ్ బాల్స్

కొమ్మాది: పర్యావరణ పరిరక్షణతో పాటు అడవులు విస్తారంగా పెరగాలనే ఉద్దేశ్యంతో వైజాగ్ రన్నర్స్ సంస్థతో కలిసి క్రెడాయ్ వైజాగ్ చాప్టర్ సభ్యులు ఆదివారం తొట్లకొండ పై నుంచి సీడ్ బాల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో శాంతి స్వరూప్ మాట్లాడుతూ ఉష్ణోగ్రత పెరగకుండా వాతావరణ సమతుల్యత కోసం, ప్రజా శ్రేయస్సు దృష్టిలో పెట్టుకుని ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాల్సి ఉందని, క్రెడాయ్ కార్యక్రమాలను మిగతా సంస్థలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్రెడా య్ సీఈవో జె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నవ్వులు పంచిన 'వినోదాల విందు'



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నిర్వహించిన 'వినోదాల విందు' కార్యక్రమం ఆద్యంతం నవ్వులు పూయించింది. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం కళాకారులు ఉత్సాహంగా పాల్గొని పలు కామెడీ స్కిట్స్ ప్రదర్శించి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. వీటిలో డ్రైవర్ ఉద్యోగం, పండగకి వస్తా, నైటీ, 6 నెలలు, పెళ్లాం కంట్రోల్, పక్కింటి ఆంజనేయులు, పెళ్లి చూపులు, దెయ్యాలు, ఫ్రిజ్ స్కిట్స్ ఆహూతు లను అలరించాయి. కళాకారులు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, అడవి రాజు, భాను, రాజు, నాయుడు, పోర్టు శేషు, మల్లిక, శంకర్ స్కిట్స్ ప్రదర్శించా రు. అనంతరం కళాకారులను నండూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, డి.నాగ రాజారావు సత్కరించారు.

నమో దుర్గామాత



చినగదిలి పోలమాంబ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



హనుమంతవాకలో లలితాదేవిగా విజయదుర్గాదేవి

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని పోలమాంబ గుడిలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. చినగదిలి, సాలిపేట, సంతపాలెం ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. హనుమంతవాక దరి విజయదుర్గా కాలనీలోని విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. హనుమంతవాక, విజయదుర్గా కాలనీ, క్రాంతినగర్, సంజయ్‌గాంధీ కాలనీల నుంచి భక్తుల తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

కష్టపడి పనిచేస్తే ఉత్తమ ఫలితాలు



దేవీ వైభవం కార్యక్రమంలో పాల్గొన్న నితాయి సేవిని మాతాజీ

బీచ్‌రోడ్డు: మన పని ఉత్తమంగా చేయాలని, అందుకోసం కష్టపడి పనిచేసి ఫలితం భగవంతుడికి వదిలేయాలని ఆధ్యాత్మిక గురువు నితాయి సేవిని మాతాజీ పేర్కొన్నారు. సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో రోటరీ క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం లోక కల్యాణార్థం దేవీ వైభవం నాలుగో రోజు కార్యక్రమంలో ఆమె ప్రవచించారు. మనకు ఉత్తమంగా అన్నీ కావాలని అనుకుంటామని, పనిచేయడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తామన్నారు. అలా కాకుండా ప్రయత్నం కూడా ఉత్తమంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ విశాఖపట్నం ప్రొగ్రాం వైద్య జన్ ఆర్జీఎన్ జగన్మోహన్, ప్రెసిడెంట్ బి.వినయగాంధీ, సెక్రటరీ బి.మణిమాల, కోశాధికారి ఎం.కె.కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇతిహాసాలపై అవగాహన ఉండాలి



ప్రశంసాపత్రాలతో వివిధ పాఠశాలల విద్యార్థులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: విద్యార్థి దశ నుంచే రామాయణం, మహాభారతం ఇతిహాసాలపై అవగాహన ఉండాలని వాసవీ క్లబ్ గవర్నర్ గుప్తా, రోటరీ క్లబ్ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం కేఎస్ గుప్తా మెమోరియల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సింబాయసిస్ టెక్నాలజీస్ నరేష్‌కుమార్ సహకారంతో రామాయణం, మహాభారతంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చూపారు. కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

ముడసర్లోవ పార్కులో మెట్లు శిథిలం



ముడసర్లోవ పార్కులో శిథిలమైన రిజర్వాయర్ మెట్లు

ఆరిలోవ: ముడసర్లోవ పార్కులోని రిజర్వాయర్ మెట్లు శిథిలమయ్యాయి. కొన్నేళ్ల నుంచి ఇవి పాడై ఉన్నా.. జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సందర్శకులు వీటి నుంచి రిజర్వాయర్ గట్టు మీదకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ముడసర్లోవ పార్కును ఆనుకొని రిజర్వాయర్ ఉంది. పార్కుకు వెళ్లే సందర్శకులు ఈ రిజర్వాయర్ చూడడానికి వీలుగా జీవీఎంసీ అధికారులు గట్టుపై మెట్లు నిర్మించారు. అందం కోసం వీటికి రంగులు వేయించారు. ఈ గట్టుపైకి వెళ్లే వారిని రిజర్వాయర్‌లో నీటితోపాటు చుట్టూ పచ్చని కొండలు కనువిందు చేస్తాయి. ఇదిలా ఉండగా కొన్నేళ్లుగా ఈ మెట్లు ఊడిపోయాయి. వీటిపై గట్టు మీదకు చేరడానికి ఇబ్బంది పడుతున్నామని సందర్శకులు అంటున్నారు. మెట్ల పక్క నుంచి వెలదామంటే దట్టమైన మొక్కలు ఉండటంతో వీలుపడటం లేదని చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఇక్కడి మెట్లకు మరమ్మతులు చేపట్టాలని సందర్శకులు కోరుతున్నారు.

పీతలవానిపాలెంలో కొత్త పార్కు ప్రారంభం



కొత్త పార్కులో పీతలవానిపాలెం వాసుల సందడి

మద్దిలపాలెం: పీతలవానిపాలెంలో జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన కొత్త పార్కును ఆదివారం స్థానికులు ఘనంగా ప్రారంభించారు. అనంతరం వారంతో పార్కులో సందడి చేశారు. పీతలవానిపాలెంలోని శ్రీకృష్ణ మందిరం వెనుకున్న ఖాళీ స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్దినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యువజన సంఘం, పీతలవానిపాలెం వాసులు నొడగల గణేష్, బొబ్బిలి సుధ, పీతల అప్పారావు దాస్, పీతల అప్పలనాయుడు, పెసల శ్రీను, పీతల వెంకటరావు, సారిపిల్లి హరి, గొంప అప్పలనరసయ్య, మల్ల రవి తదితరులు పాల్గొన్నారు.